పోదు. చచ్చాక వర్షం రాదు. విశ్వాసంతో ప్రార్థిస్తే అష్టైశ్వర్యాలు లభిస్తాయి."

"అది తర్వాత రాసివ్వు నాయనా" వెంకాయమ్మ కోరింది ఆయన్ని.

"అలాగే. ఆచమనం చేయండి... ఏవం గుణ విశేషణ విశిష్టె యమస్యాం శుభ తిథౌ చిత్రగుప్త. యమ సూర్యనారాయణ దేవతా ఉద్దిశ్య చిత్రగుప్త. యమ, సూర్యనారాయణ దేవతా ప్రీత్యర్థం స్కాంద పురాణోక్త కల్ప ప్రకారేణ యావచ్ఛక్తి ధ్యానావాహనాది షోడశోపచార పూజాం కరిష్యే..."

ఆయన సంస్కృతంలో చిత్రగుప్త వ్రతానికి సంబంధించిన మంత్రాలు చదువుతూ అనసూయ, శ్రీనాథ్‌ల చేత పూజ చేయించి హారతి వెలిగించి కొబ్బరికాయలు కొట్టించాడు. దాదాపు ఇరవై నిమిషాల తర్వాత చిత్రగుప్తుడి నూట నలభై ఆరు నామాలు చదువుతూ పుష్ప పూజ చేయించాడు.

చిత్రాయ నమః... చిత్రగుప్తాయ నమః... యమభటాయ నమః... మృత్యురూపిణే నమః... కృష్ణాంగాయ నమః... వికృత వదనాయ నమః... క్రోధనాయ నమః... క్రోధరూపాయ నమః... భయంకరాయ నమః...

మరో నలభై నిమిషాల సేపు ఆ పూజ జరిగాక "......ఇతి శ్రీ స్కాంద పురాణే శివకుమార సంవాదే చిత్రగుప్త వ్రత కల్పం సంపూర్ణం" అని పూర్తి చేశాడా బ్రాహ్మడు. తర్వాత గోదానం. గోదానం బదులు నూట పదహార్లు ఇచ్చాడు శ్రీనాథ్. వ్రత ఉద్యాపన అయ్యాక మళ్ళీ కొబ్బరి కాయ కొట్టాడు. తర్వాత వెండితో చేసిన చిన్న తాటాకు, ఘంటాలని అనసూయ అన్నయ్యకి దానం చేశారు అనసూయ, శ్రీనాథ్ కలిసి. వాటిని ఇవ్వబోయే ముందు చెప్పించాడు బ్రాహ్మడు ఆ దంపతు లిద్దరిచేత.

"ఓ చిత్రగుప్తా. మా దంపతులు భూలోకమున చేసిన సమస్త పాపములను హరించి మాకు మోక్షము కలుగజేయుము". తరతరాలుగా వస్తున్న వైదిక సాంప్రదాయం అది.

కొబ్బరికాయ కొట్టాక చిత్రగుప్త వ్రత కథని మొదట బ్రాహ్మడు ముందు సంస్కృతంలో చెప్తుంటే దానికి తెలుగు అర్థం చెప్పసాగాడు రెండో బ్రాహ్మడు.

"సుపుణ్యే నైమిశారణ్యే మానసాహ్లాదకారిణి..."

"నైమిశారణ్య మునసున్న ఋషులందరు..."

సూక్ష్మంగా చిత్రగుప్త వ్రత కథ...

'అన్ని రకాల పాపాలు చేసిన ఓ మనిషి రోజూ భోజనమునకు ముందు 'చిత్రాయ' 'చిత్రగుప్తాయ' 'యమ రూప ధారయే' అని చెప్పి చిత్రగుప్తునికి మూడు బలులు వేసేవాడు. అతని భార్య సోమి అత్తమామల్ని బాధించి గయ్యాళిగా వుండేది. మరణానంతరం ఈ ఇరువురి పాపపుణ్యములు పరిశీలించి చూస్తే ప్రతి పాపము సున్నలుగా చుట్టబడ్డాయి. వాళ్ళిద్దరూ వైకుంఠానికి వెళ్ళారు!

ఆ రాత్రంతా దంపతులిద్దరూ నిద్రపోకుండా జాగరణ చేశారు. టేప్‌రికార్డర్‌లో ఘంటసాల భక్తి పాటలు, గీత వింటూ.

మర్నాడే శ్రీనాథ్ యమపురికి వెళ్ళే రోజు. ఆ సంగతి శ్రీనాథ్‌కి తెలీదు. యమభటులకి తెలుసు.

(ఇంకా వుంది)



"మల్లాది వారు 'యమాయనమః'మ ఆహ్లాద గుళికలు రంగరించిన బోర్న్‌విటాతో లిఖించిరా యేమి?" కాకున్న ఒక్కసారి పఠించిన తోడనే . మాకెందుకింత ఉత్సాహము, మనశ్శాంతి కలుగవలె? ఆహా, మల్లాదికి అభినందనలు

— కె. బసవ శంకరరావు, ఘంటసాల



ఈ సీరియల్ చదువుతున్నంత సేపు ఆ సమస్యలను మరిచిపోయి హాయిగా మనసారా నవ్వుకోగలుగుతున్నాం.

- కూసంపూడి ప్రభాకర్‌రావు, సత్తుపల్లి

## కృతజ్ఞత

"ఈసారి పిక్చరు మేం స్పాన్సర్ చేస్తాం" డిమాండ్ చేశాడు బిస్కెట్ల కంపెనీ మానేజరు.

"లాస్ట్ వీక్ పిక్చర్ మొత్తం మీరే కదండీ స్పాన్సర్ చేసింది? ఈసారి మాకిచ్చెయ్యండి" టైర్ల కంపెనీ మానేజింగ్ డైరెక్టర్ అడిగేడు.

విడుదలైన మూడు రోజులకే డబ్బాలు షెడ్‌కి వెళ్ళిపోయిన 'హారతి కర్పూరం' సినిమాని ఓ శనివారం దూరదర్శన్ వారు టెలికాస్ట్ చెయ్యతలపెట్టారు.

ఆ పిక్చర్ని ఎవరెవరు స్పాన్సర్ చెయ్యాలనే అంశం మీద చర్చ జరుగుతోందక్కడ.

ఉభయులకీ ఆమోదయోగ్యంగాను, ఉభయ తారకంగానూ వుండే సలహా పడేశాడు కన్ఫెక్షనరీ కంపెనీ మేనేజింగ్ పార్టనర్. "ఓ పని చేద్దాం. ఈ వారం పిక్చర్ని మీ రెండు కంపెనీలూ, ప్లస్ మేమూ కలిసి స్పాన్సర్ చేద్దాం. మూడు కంపెనీల ప్రొడక్ట్స్‌కి పబ్లిసిటీ అయినట్టూ వుంటుంది. మనకి ఖర్చు తగ్గినట్టూ వుంటుంది. మొత్తం ఖర్చుని ముగ్గురం సమానంగా భరిద్దాం"

"మిగిలిన కార్యక్రమాలు, సీరియల్స్ మిగిలిన కంపెనీలు అన్నీ స్పాన్సర్ చేస్తున్నాయి కాబట్టి — ఈ వారం పిక్చరు బిస్కెట్స్, టైర్స్, చాక్‌లెట్స్ కంపెనీ వాళ్ళు స్పాన్సర్ చేస్తారు — ఎనీ అబ్జెక్షన్..." అక్కడున్న వారందరినీ ఉద్దేశించి అన్నాడు అగర్‌బత్తీ ఓనరు.

"నో... ఐ అబ్జెక్ట్" దాదాపుగా అరిచాడో వ్యక్తి. అంతవరకూ అతడు చాలా కామ్‌గా వున్నాడు.



"అదేమిటండీ... టి.వి. సీరియల్స్, సినిమాల కారణంగా మీకు సేల్స్ బాగానే వుంటున్నాయిగా! ఎడ్వర్‌టైజ్‌మెంట్ అవసరం ఎక్కువ లేకుండానే సేల్స్ పెరుగుతున్న ఏకైక కంపెనీ మీదేగా —" ఆశ్చర్యంగా అడిగేడు వాషింగ్ పౌడర్ కంపెనీ ప్రతినిధి.

"ఈ సినిమా ప్రభావం మా కంపెనీ ప్రోడక్ట్ మీద చాలా వుంటుంది. ఆ కృతజ్ఞతతోనే ఈ పిక్చర్ మొత్తాన్ని మేమే స్పాన్సర్ చెయ్యాలనుకుంటున్నాం. స్పాన్సరింగ్‌కి చాలా ఖర్చు చెయ్యాలనే ఆలోచన కూడా మాకు లేదు. దూరదర్శన్‌వారి పుణ్యమా అని మాకు పెరిగిన సేల్స్‌లో ఈ ఖర్చు ఏ మూలకి? నాట్ కన్సిడరబుల్. 'దూరదర్శన్' మాకు చేస్తున్న సహాయానికి — నిజానికి మొత్తం ప్రోగ్రామ్స్ మేమే స్పాన్సర్ చెయ్యాల" చిర్నవ్వు చిందిస్తూ అన్నాడా వ్యక్తి.

అతడు 'మా' అంటున్న కంపెనీ—

—అమృతాంజనం!!

—గోపరాజు రాధాకృష్ణ